క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

చేవెళ్ల: మండలంలోని లబ్ధిదారులకు వచ్చిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్ తెలిపారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ఈ ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఆయా గ్రామాల లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

అనాథ ఆశ్రమానికి మహిళ తరలింపు



షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని అనాథ మహిళను ఆస్పత్రి సిబ్బంది అనాథ ఆశ్రమానికి సోమవారం తరలించారు. వివరాల ప్రకారం .. కాలికి తీవ్ర గా యాలతో 108 వాహనంలో షాద్‌నగర్ ప్రభు త్వ కమ్యూనిటీ ఆస్పత్రికి వచ్చిన అనాథ మహిళకు ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం చేశారు. పేరు, ఊరు తెలియని అనాథ మహిళ ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని ఆస్ప త్రి సిబ్బంది ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న ఫౌండేషన్ చిల్డ్రన్ ఇన్ నీడ్ ఆశ్రమం వారికి సమా చారం అందించారు. వెంటనే స్పందించిన సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా థామస్ దంపతులు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని అనాథ మహిళకు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో కాలుకు సొంత ఖర్చులతో ఆపరేషన్ చేయించారు. అనంతరం ఆశ్రమానికి తరలించారు.

ఆరోగ్యశ్రీ తరహాలోనే ఆయుష్మాన్ భారత్

సర్పంచ్ కుర్వ జయమ్మ



కేవైసీ నమోదు చేస్తున్న సర్పంచ్ జయమ్మ

షాబాద్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ నమోదు చేసుకోవాలని ముద్దెంగూడ గ్రామ సర్పంచ్ కుర్వ జయమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో కేవైసీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ నమోదుకు కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల వరకు వైద్య సదుపాయం పొందవచ్చని చెప్పారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ స్కీంలను కలిపి అమలు చేస్తున్నారు. కార్యక్రమలో సీఎస్‌సీ ఆపరేటర్స్ అశ్విని, నవ్య, గ్రామస్తులు తదితరులున్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రీజినల్ కోఆర్డినేటర్ శారద

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2023-24 సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ శారద పేర్కొన్నారు. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు టీజీయూజీ సెట్ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులు ఇన్‌లైన్‌లో స్వీకరిస్తామని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు వచ్చే మార్చిలో ఇంటర్ పూర్తి చేసిన అనంతరం ఈ డిగ్రీ విద్యకు అర్హులని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షలు, 2.0 లక్షలు ఉండాలని తెలిపారు.

సమస్యలు పట్టని బీఆర్ఎస్

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్

కేశంపేట: ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని దేవునిగుడి తండా గ్రామంలో రెండు లక్షల సొంత నిధులతో వాటర్‌ప్లాంట్‌ను శంకర్ ఏర్పాటు చేశారు. సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారని అందుకు స్పందించి వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గుడి నిర్మాణానికి ఆర్థిక సహాయం

మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులోని తులవానిగడ్డలో నిర్మాణంలో ఉన్న శివాలయం నిర్మాణానికి రెండు లక్షల ఆర్థిక సహాయం నిర్వాహకులకు శంకర్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అల్వాల ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, రూప్లానాయక్, శేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

- 8 నెలలుగా సర్పంచ్‌లకు అందని బిల్లులు
- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి



ఎంపీపీ ప్రశాంతిరెడ్డికి వినతి పత్రం అంజేస్తున్న సర్పంచ్‌లు

షాబాద్: విద్యుత్ సమస్యలపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతినెల బిల్లులు మాత్రం చెల్లించుకుంటారని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు విద్యుత్ బిల్లులు చెల్లించేది లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారులపై మండిపడ్డారు. సోమవారం షాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్ అంశంపై ఏఈ నరేందర్ మాట్లాడుతుండగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనపై విరుచుకుపడ్డారు. ప్రతినెలా విద్యుత్ బిల్లులు వసూలు చేసుకుంటున్నారని, సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోరని, ఏఈ కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ ప్రశాంతి రెడ్డి, ఎంపీడీఓ అనురాధలు మాట్లాడుతూ...గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. సర్పంచ్‌లకు గత 8 నెలల నుంచి కేంద్ర నిధులు గాని రాష్ట్ర నిధులు గాని రావడం లేదని సర్పంచ్‌ల పరిస్థితి చాలా దారుణంగా ఉందని చెప్పారు. సర్పంచ్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఎంపీపీకి వినతి పత్రం అందజేశారు. సగం మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ మధ్యలోనే వెళ్లి పోయారు. ఏ పని చేసినా సకాలంలో బిల్లులు రాక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సొంత నిధులతో ఎన్ని పనులు చేసినా అవి ఏ మూలకు సరిపోవడం లేదని, గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు లేక ట్రాక్టర్‌కు డీజిల్‌లేక, కరెంటు బిల్లులు కట్టలేక గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిపోయాయని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఏఈలు దివ్య, నరేందర్, శారద, వైద్యులు వరలక్ష్మి, శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏఓ వెంకటేశం, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, ఎంఈఓ శంకర్‌రాథోడ్ తదితరులున్నారు.



సర్వసభ్య సమావేశంలో ఖాళీగా ఉన్న సగం కుర్చీలు

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

మహిళా శిశుసంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ విశాల



పోటీలను ప్రారంభిస్తున్న విశాల

షాద్‌నగర్‌రూరల్: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని మహిళా శిశుసంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తాండ్ర విశాల అన్నారు. గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్‌లోని మినీస్టేడియంలో జనశిక్షణ సంస్థాన్ సంస్థ, ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో మహిళలకు కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను తాండ్ర విశాల ప్రారంభించి మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని అన్నారు. మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించి తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. తద్వారా సమాజంలో మహిళలకు ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. అలాగే, ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఫెమినా సేవా మండల వారు మహిళల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమన్నారు. మహిళలకు మగ్గం, టైలరింగ్, బ్యూటీషన్‌లో శిక్షణ ఇస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతుండడం హర్షనీయమని కొనిడాయారు. కార్యక్రమంలో ఫెమినా సేవా మండలం అధ్యక్షురాలు ఆలియా సుల్తానా, న్యాయవాది సబియా సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను తప్పక చదివించాలి

సర్పంచ్ సంతోష



ర్యాలీ ప్రారంభిస్తున్న సర్పంచ్ సంతోష

నందిగామ: ఆడపిల్లలను విధిగా చదివించాలని సర్పంచ్ మామిళ్ల సంతోష అన్నారు. మండల పరిధిలోని చేగూరులో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష మాట్లాడుతూ.. ఆడపిల్లలు లేనిదే సమాజం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరు కొడుకులతో సమానంగా కూతుళ్లను చదివించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీణా, ఉపాధ్యాయులు సమీర వాణి, ఆనందశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు శివలీల, స్వర్ణలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని వినతి



బీజేపీ నేతలకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పబ్బె జనార్దన్ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం బీజేపీ నాయకులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్ల నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమాలకు, ఆందోళనలకు బీజేపీ నాయకులు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన వర్గీకరణ హామీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరగకపోవడంతో మాదిగ ఉపకులాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు అన్ని రంగాల్లో అన్యాయానికి గురవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రవికుమార్, శ్రీశైలం, నవీన్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు సైనికుల్లా పని చేయాలి

బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



బూత్‌కమిటీల ఎన్నికలో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూరు: క్షేత్రస్థాయిలో బీజేపీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని ఆ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొడిచర్ల, కొడిచర్లతండాల్లో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్‌కమిటీ ఎన్నికలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అంతేకాకుండా ఆయా పథకాల కోసం కేంద్రం రాష్ట్రానికి మంజూరు చేస్తున్న నిధుల వివరాలను తెలియజేయాలి. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధి కారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, జైపాల్,సంతోష్, మోహన్, రవినాయక్, మల్లారెడ్డి, గణేష్, శివశంకర్, ఆనంద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలతో రైతుకు మేలు

మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు



పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పాపారావు

శంకర్‌పల్లి: పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎల్వర్తి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేయడంతో పాటు నట్టల నివారణ మందులను వేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణను కూడా వృద్ధి చేసుకోవాలని సూచించారు. పశు పోషణతో రైతులకు మంచి ఆదాయం పొందవచ్చన్నారు. వైద్య శిబిరంలో 29ఆవులు, 83గేదెలు, 350గొర్రెలకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎల్వర్తి సర్పంచ్ సత్యనారాయణ, మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి జయసుధ, పైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణకు కృషి



బాలికదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి, తదితరులు

ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: ఆడపిల్లల విద్యను ప్రోత్సహించి బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవంలో సందర్భంగా భేటి భాచావో, భేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల జరిగే అనార్థాలను వివరించారు. ఆడపిల్లలకు సరైన విద్యాబుద్ధులను అందిస్తే వారు తమ కుటుంబాన్ని చక్కగా నడిపించుకుంటారని తెలిపారు. అందుకు బాలికలకు తప్పనిసరిగా విద్యను అందించాలన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుందని చేవెళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంతో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత పెద్దల సమక్షంలో ఏడాది నిండిన పిల్లలకు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అలాగే, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజ్‌కుమార్, డాక్టర్ వాణి, మతపెద్దలు అబ్దుల్ బాసిత్, ముస్తాఫా, ఖాదర్, అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో పేదలకు ప్రయోజనం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న జయలక్ష్మి

షాద్‌నగర్: గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాయికల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే, రాయికల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యుత్ సరిగ్గా ఉండడం లేదని వైద్య సిబ్బంది డిప్యూటీ డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే డిప్యూటీ డీఎంహెచ్ఓ విద్యుత్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు రాఘవేందర్, శ్వేత, బిందు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పలత, రెడ్డినాయక్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాల పరిశీలన

కేశంపేట: మండల పరిధిలో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాలను షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని సంగెం, కేశంపేట గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలను డాక్టర్ జయలక్ష్మి పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేశంపేటలో అర్హులకు కంటి అద్దాలను అందించారు. ఆయా కార్యక్రమాల్లో కేశంపేట గ్రామ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, డాక్టర్లు కార్తీక్, ఆనం నాజం, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కిషన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రార్థనా సమయంలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే హాజరు కావడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠశాల సమయంలో విధిగా హాజరు కావాలని సూచించారు. పాఠశాలలో ఉన్న మొత్తం పది మంది సిబ్బందికి ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని తెలిపారు. అయితే, పాఠశాలలో పని చేసే కొందరు ఉపాధ్యాయులు విధులకు సరిగా హాజరు కాకపోవడం సరికాదన్నారు. ఉపాధ్యాయులు విధులు సరిగా నిర్వహించకపోవడం పద్ధతి కాదని అస హనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

కాంగ్రెస్ యువజన నాయకుడు వెంకటేశ్

చేవెళ్ల: గ్రామాల్లోని యువ క్రీడాకారులకు ప్రోత్సహం అందించాలని అంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ జిల్లా యువజన నాయకుడు వెంకటేశ్ అన్నారు. మండలంలోని హస్తేపూర్ గ్రామంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు పోటీలో గెలుపొందిన చనుగోముల్ టీమ్‌కు రూ.20వేల నగదు, షీల్డ్, రన్నర్‌గా నిలిచిన హస్తేపూర్ జట్టుకు 10వేల నగదు, షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాష, సుధాకర్, వీరాంజనేయులు, సంజయ్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



షాద్‌నగర్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



మొయినాబాద్: పూర్వ విద్యార్థుల బృందం, పూర్వ ఉపాధ్యాయులు

షాద్‌నగర్: మండలంలోని చేగూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం కార్యక్రమాన్ని సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలోని రాయల్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత కలిసి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు దినేష్, విష్ణువర్ధన్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పెంజర్ల మల్లేష్, పబ్బె సుధాకర్, చంద్రశేఖర్, రజాక్, భానుచందర్‌గౌడ్, కుమార్, వేణు, నర్సింహ్మ, సుధాకర్, సురేఖ పాల్గొన్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం

మొయినాబాద్: 20 ఏళ్ల తరువాత వారంతా ఒక చోట కలిసి విద్యార్థి దశను గుర్తు చేసుకొని పాత స్నేహితులతో మళ్లీ విద్యార్థులుగా మారి సంతోషంగా గడిపారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని మెథడిస్ట్‌రూరల్ చిల్డ్రన్ హైస్కూల్‌కు చెందిన 2002-2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వ విద్యారులు సమ్మేళనంతో ఉల్లాసంగా గడిపారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

- మాజీ ఎమ్మెల్సీ, పీఆర్టీయూ నేత రవీందర్
- పెద్ద మంగళారంలో విగ్రహం ఏర్పాటు



మొయినాబాద్: జయంతి వేడుకల్లో విద్యార్థులు

మొయినాబాద్: నేతాజీ సుభాస్‌చంద్రబోస్ నేటి యువతకు స్ఫూర్తిదాయకుడని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్టీయూ నేత రవీందర్ అన్నారు. మండలంలోని పెద్ద మంగళారం గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ సైనికుడు బోలించెరువు క్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ సుభాస్‌చంద్రబోస్ జయంతి నాడు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలను లెక్కచేయని జాతీయ నేతల విగ్రహాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారి విగ్రహాల ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్

షాద్‌నగర్: దేశాన్ని పాలించిన బ్రిటీష్ పాలకులను ధైర్యంగా ఎదిరించిన పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. నేతాజీ జయంతిని షాద్‌నగర్ పట్టణ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. దేశ వ్యాప్తంగా వేలాది మందిని తన బాటలో పయనింపజేసి ఆజాద్ హిందుఫౌజ్ సంస్థను స్థాపించాడని చెప్పారు. తాను అనుకున్న లక్ష్యం నెరవేరక ముందే దేశానికి స్వాతంత్య్రం రాకముందే అనూహ్యంగా చంద్రబోస్ అదృశ్యమయ్యాడని అన్నారు.

గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో మంకాల అరుణ, శేఖర్, సుధాకర్, గోపాల్, జంగరాజు, రావుఫ్, జగ న్, ఎండీ సలీం, సూర్య, ఆంజనేయులు, నవీన్ పాల్గొన్నారు.

కొందుర్గులో

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబురావు మాట్లాడుతూ..స్వాతంత్య్రం కోసం సుభాష్ చంద్రబోస్ అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పతంజలి, పంచాయతీ కార్యదర్శి సమంత, గ్రామస్తులు బాలయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.